సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 11 । జూన్ । 2024



అంతా 'పుష్ప' స్టైల్‌లోనే..

గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. అక్రమార్కులు మాత్రం సినీ ఫక్కీలో తరలిస్తూనే ఉన్నారు. 8లో



అటవీ శాఖలో ఇంటి దొంగలు!

పోడు కోసం అడవి నరకగా, అటవీ శాఖలోని కొందరు సిబ్బందే విలువైన కలపను మాయం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం 37°/25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, సోమవారం నిర్వహించిన నిత్య కల్యాణానికి 35, పట్టాభిషేకానికి 14 టికెట్లు విక్రయించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు వివిధ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తారు. అనంతరం ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న సప్లిమెంటరీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. సోమవారం సైన్స్ పేపర్–2 పరీక్షకు 702 మంది విద్యార్థులకు గానూ 558 మంది హాజరయ్యారని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఐదు కేంద్రాల్లో తనిఖీ చేశారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

బడిబాట ఫ్లెక్సీలో కేసీఆర్, సబిత ఫొటోలు

అభ్యంతరం వ్యక్తం చేసిన గ్రామస్తులు



కేసీఆర్, సబిత ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పులిగుండాలలో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమ ఫ్లెక్సీలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫొటోలు దర్శనమిచ్చాయి. దీంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఐటీడీఏ పీఓతో పాటు విద్యాశాఖాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కాగా, గతేడాది నిర్వహించిన బడిబాట కార్యక్రమ సమయంలో ముద్రించిన ఫ్లెక్సీనే ఈ ఏడాది కూడా వాడడంతో ఈ గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది.

అడవి బిడ్డలకు సదుపాయాలు కల్పించాలి

చంద్రుగొండ : అడవినే నమ్ముకుని జీవనం సాగించే ఆదివాసీలకు కనీస సదుపాయాలు కల్పించాలని ఆలిండియా గిరిజన ఫోరం నాయకురాలు, జార్ఖండ్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వాసవికిరో ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని బెండాలపాడు గ్రామ శివారు కనకగిరి అటవీ ప్రాంతంలోని ఎర్రబోడు ఆదివాసీ గూడేన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజం ఆధునికంగా అభివృద్ధి చెందుతున్నా ఆదివాసీలు మాత్రం దుర్భర జీవనం సాగించడం దురదృష్టకరమన్నారు. వారికి విద్యుత్, తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య వంటి మౌలిక వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో ఇక్కడ జరిగిన రేంజర్ హత్య దురదృష్టకరమని అన్నారు. దాన్ని సాకుగా చూపుతూ పోడు భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఆమె వెంట అఖిల భారత రైతుకూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అవునూరి మధు, నాయకులు ఎస్కే ఉమర్,, వరికూటి వెంకట్రావ్ తదితరులు ఉన్నారు.

'ప్లాన్'పై పట్టింపేది ?

- కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు పాత మాస్టర్ ప్లాన్‌లే దిక్కు
- ఇల్లెందులో కసరత్తు చేసినా ముందుకు సాగని వైనం
- మణుగూరులో ఆ ఊసే లేదు



కొత్తగూడెం పట్టణ వ్యూ

సుదీర్ఘ ఎన్నికల కోడ్ ముగిసింది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం పట్టణ ప్రగతిపై దృష్టి సారించింది. ఇప్పటికే మధిర మున్సిపాలిటీలో రూ.128 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రెయినేజీకి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇదే తరహాలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న భద్రాద్రి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఇందులో ఏ ఒక్క మున్సిపాలిటీకి ఇప్పటివరకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ లేదు. గత ప్రభుత్వ హయాంలో మాస్టర్‌ప్లాన్ కోసం ప్రయత్నాలు జరిగినా కార్యరూపం దాల్చలేదు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మారిన అవసరాలు..

భద్రాద్రి జిల్లా ఏర్పాటైన తర్వాత కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల పరిస్థితి మారిపోయింది. వివిధ జిల్లా కార్యాలయాలు తరలిరావడంతో ఈ రెండు పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఆమోదం పొందిన మాస్టర్ ప్లాన్లు భవిష్యత్ అవసరాలను తీర్చేలా లేవు. ఇప్పటికే ఉన్న రోడ్లన్నీ ఇరుకుగా మారాయి. రెండు పట్టణాల్లోనూ పార్కింగ్ సమస్య నానాటికీ పెరుగుతోంది. దీంతో పాటు సింగరేణి లీజు స్థలాలు, లేఅవుట్ ప్లాట్ల వంటి సమస్యలతో సొంత ఇల్లు ఉన్న వారికి, కొత్తగా నిర్మించాలనుకునే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. పారిశ్రామిక కేంద్రాలైన ఈ జంట పట్టణాలకు ఇప్పటికీ బైపాస్ రోడ్డు లేదు. అందుబాటులో ఉన్న వివిధ రోడ్లనే బైపాస్ రోడ్లుగా వినియోగిస్తున్నా.. పెరుగుతున్న రద్దీకి అవి సరిపోవడం లేదు. మరోవైపు ఈ రెండు పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిపాదన చేస్తునారు. కనీసం ఆ దిశగా ప్రయత్నాలు మొదలైనా రెండు పట్టణాలు ప్రణాళికాయుతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

ఇల్లెందులో ఇంటిపోరుతో..

నాలుగు దశాబ్దాలకు పైగా మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ ఇల్లెందు పట్టణానికి మాస్టర్ ప్లాన్ లేదు. ఇక్కడ 24 వార్డులు ఉండగా 50 వేలకు పైగా జనాభా ఉంది. అనేక మున్సిపల్ పాలకమండళ్లు కొలువుదీరినా.. పట్టణానికి మాస్టర్ ప్లాన్ ఊసే లేదు. దీంతో ఇక్కడ భవిష్యత్‌లో పెరగబోయే జనాభా, జరగాల్సిన అభివృద్ధి, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుని మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని మున్సిపల్ పాలక మండలి గతేడాది నిర్ణయించింది. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అనుభవం గల ఏజెన్సీని గుర్తించే పనిలో ఉండగానే మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల మధ్య తలెత్తిన వివాదం ముదురుపాకాన పడింది. అంతర్గత పోరు రచ్చకెక్కింది. దీంతో మాస్టర్ ప్లాన్ అంశం మరుగున పడిపోయింది.

మణుగూరు మారుతోంది..

మణుగూరు 2005లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. అయితే పాలకమండలి ఎన్నికలు జరగకపోవడంతో గత 17 ఏళ్లుగా అధికారుల పర్యవేక్షణలో పురపాలన కొనసాగుతోంది. ఒకప్పుడు మణుగూరు పట్టణ భవిష్యత్ సింగరేణిపైనే ఆధారపడి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. కొత్తగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వంటి ప్రతిష్టాత్మక పారిశ్రామిక సంస్థ, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు వచ్చాయి. సీతమ్మసాగర్ బ్యారేజీ అందుబాటులోకి వస్తే చర్ల, దుమ్ముగూడెం మండలాలతో మరింత కనెక్టివిటీ పెరుగుతుంది. ఫలితంగా రాబోయే రోజుల్లో మణుగూరులో వ్యాపార కార్యకలాపాలు పుంజుకోనున్నాయి. అందుకు అనుగుణంగా మణుగూరు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తీసుకురావాల్సిన అవసరం ఉంది.

రెండు చోట్లా పాతవే..

జిల్లాలో కొత్తగూడెంతో పాటు పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు గతంలోనే మాస్టర్ ప్లాన్లు ఉన్నాయి. ఏ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన కొత్తగూడెం పట్టణంలో 36 వార్డులు ఉండగా జనాభా సుమారు 80 వేల మంది ఉన్నారు. తెలంగాణ వచ్చిన కొత్తలో 2014లో ఇక్కడ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. దీనికి తగ్గట్టుగానే భవన నిర్మాణ అనుమతులు, రోడ్లు, డ్రెయినేజీల పనులు జరుగుతున్నాయి. ఇక పాల్వంచ పట్టణ మాస్టర్ ప్లాన్ 2005లో ఆమోదం పొందింది.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక అల



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు తరలివచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తామని అధికారులు ప్రకటించి.. 10.20 గంటలకు ప్రారంభించడంతో సుమారు గంటపాటు వేచి ఉన్న ప్రజలు కొంత అసహనానికి గురయ్యారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటి వివరాలిలా..

- తనకు వారసత్వంగా వచ్చిన భూమిని తమ పెదనాన్న కుమారుడు తోట రామచంద్రరావు ఎలాంటి ఆధారాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాన్ని స్థానిక మండల కార్యాలయం నుంచి అక్రమంగా తీసుకున్నాడని, సాగులో తామే ఉన్నామని, పూర్తి ఆధారాలు పరిశీలించి ఆ పాసు పుస్తకాన్ని రద్దుచేయాలని అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు వినతిపత్రం అందించగా అశ్వాపురం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- వ్యవసాయ భూమి దారి విషయంలో హైకోర్టు ఇరు పార్టీల వారికి స్టేటస్ కో మెయింటెన్ చేయమని ఉత్తర్వులు జారీ చేసినా వాటిని ఉల్లంఘిస్తూ డొంక రోడ్డును దున్నేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని చంద్రుగొండ గ్రామానికి చెందిన వజ్రాల వీరారెడ్డి దరఖాస్తు చేయగా ఆ మండల తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- తమ ఇళ్ల పైనుంచి 33 కేవీ విద్యుత్ లైన్ వెళుతోందని, తొమ్మిది వార్డుల్లో వైర్లు తొలగించిన అధికారులు తమ వార్డులో మాత్రం తొలగించడం లేదని, దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పాల్వంచలోని మూడో వార్డు గాంధీనగర్‌కు చెందిన కె.సులోచన ఫిర్యాదు చేయగా విద్యుత్ ఎస్ఈకి ఎండార్స్ చేశారు.
- కేపీసీ కంపెనీ ద్వారా కలెక్టరేట్‌లో ఐదేళ్లుగా పని చేశానని, తన పిల్లలకు ఆరోగ్యం బాగాలేక మధ్యలో కొన్ని రోజులు మానేశానని, ఏదైనా పని ఇప్పించాలని పల్లపు స్వాతి అనే మహిళ చేసిన దరఖాస్తును కలెక్టరేట్ ఏఓకు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెం మున్సిపాలిటీలో విలీనమైన ఏజెన్సీ ప్రాంతాన్ని తొలగించాలని చిట్టి రామవరం తండాకు చెందిన గిరిజనులు ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక అల, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామికి వినతిపత్రం అందజేశారు.

తమ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి, పోలీస్ స్టేషన్‌లలో దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని పాల్వంచ పట్టణం శ్రీనివాసబంజర కాలనీకి చెందిన దివ్యాంగురాలు నారపోగు నాగమణి కలెక్టర్‌ను వేడుకుంది. సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేయడానికి వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెబుతున్నారని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కలెక్టరేట్‌కు వెళ్లమంటున్నారని కన్నీటిపర్యంతమైంది. తన వివాహ సమయంలో తన తండ్రి నారపోగు ముత్యం శ్రీనివాస బంజర కాలనీలో రేకుల ఇల్లు, ఖాళీ స్థలం రాసిచ్చారని, మున్సిపాలిటీ రికార్డుల్లో నమోదై ఇంటి పన్ను కూడా కడుతున్నా.. పక్కనున్న వేముల కుమారి, తమ్మిశెట్టి పద్మ, నారపోగు నాగరాజు తమ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

పాస్‌బుక్కులు ఇప్పించండి..

కొత్తగూడెంరూరల్: తాము అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరైనా తమకు ఇవ్వడం లేదంటూ లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి రేగళ్ల గ్రామ గిరిజన రైతులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖ అధికారులతో త్రిసభ్య కమిటీ వేసి సర్వే చేయించారని, తాము సాగు చేసుకుంటున్న సుమారు 500 ఎకరాల భూములకు పట్టదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు అంగీకరించారని, అయితే కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వలేదని వినతిపత్రం అందించారు. దీంతో సత్వరమే చర్య తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ బృందం సభ్యులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్‌కు అనువైన స్థలాన్ని కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ బృందం సోమవారం పరిశీలించింది. ఈ పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్‌తో సహజ వనరులతో విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటైతే ఇల్లెందుకు పూర్వ వైభవం లభిస్తుందని భావిస్తోంది. కాగా, ఇల్లెందులో పర్యటించిన కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ బృందంలో జీఎం(సీపీపీ) రవికుమార్, జీఎం(సర్వే) జైనువద్దీన్, ఏజీఎం(ఇఅండ్ ఎం) బీడీవీ ప్రసాద్, ఎస్ఈ(ఈఅండ్ఎం) నటరాజ్, ఎస్ఈ(ఈఎం)(సోలార్) నటరాజ ప్రసాద్, ఎస్ఈ(ఈఎం నాగేంద్ర కుమార్, ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్, జేకే ఓసీ ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం(సర్వే) బాలాజీ నాయుడు, ఎస్టేట్ అధికారి శివకుమార్ ఉన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు అవార్డులు



దివ్య



సాహితి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్థాయిలో అవార్డులు దక్కాయి. హైదారాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన స్నాతకోత్సవంలో స్థానిక విద్యార్థులు బజ్జూరి దివ్య విశ్వవిద్యాలయం స్థాయిలో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్(మార్కులు) సాధించినందుకు గాను 6 పసిడి పతకాలను సాధించగా, పసుపులేటి సాహితి అకడమిక్స్, కో–కర్రీక్యులర్ కార్యకలాపాలలో ఉత్తమ ప్రదర్శనతో పీజేటీఎస్ఏయూ అత్యుత్తమ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు.

గుడ్డు.. వెరీ బ్యాడ్

- అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు సరఫరా
- అధికారుల పర్యవేక్షణ కొరవడడమే కారణం
- చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై దుష్ప్రభావం

ఖమ్మంవన్‌టౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలను అధిగమించేందుకు మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తూ పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇందులో గర్భిణులు, బాలింతలకు ప్రతీ నెల 30, మూడేళ్ల లోపు చిన్నారులకు 16, మూడు నుండి ఆరేళ్ల లోపు పిల్లలకు రోజుకు ఒక గుడ్డు చొప్పున అందజేస్తారు. ఖమ్మం జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, గత నెల నివేదికల ఆధారంగా 8.10లక్షల గుడ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇదంతా బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కానీ లబ్ధిదారులకు ఇచ్చే గుడ్లలో నాణ్యత ఉండడం లేదని విమర్శలు వస్తున్నాయి.

అధికారులు చూస్తున్నారా?

జిల్లాలో 1,840 అంగనాడీ కేంద్రాలు కొనసాగుతుండగా జిల్లా సంక్షేమాధికారితో పాటు ఏడుగురు సీడీపీఓలు, 69 మంది సూపర్‌వైజర్లు వీటిని పర్యవేక్షించాలి. ఇక 1,746 మంది అంగన్‌వాడీ టీచర్లు గాను 94 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే, అధికారులు, ఉద్యోగుల పర్యవేక్షణ లోపం లబ్ధిదారులకు ఇక్కట్లను తెచ్చిపెడుతున్నట్లు తెలుస్తోంది. పౌష్టికాహారంలో భాగంగా ఇచ్చే గుడ్లు నాణ్యత లేనివి, కుళ్లిపోయిన వస్తుండడంతో లబ్ధిదారులకు ఒక్కోసారి ప్రాణసంకటంగా మారుతోంది. ఆరోగ్యంగా ఎదగాల్సిన శిశువు దగ్గర నుండి చిన్నారుల వరకు ఏదైనా జరిగితే బాధ్యులెవరన్న ప్రశ్న తలెత్తుతోంది.

బరువు అంతంతే...

సాధారణ రోజుల్లో నెలకు రెండుసార్లు కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తారు. ఇక వేసవిలో గుడ్లు పాడయ్యే అవకాశం ఉండడంతో నెలకు మూడు సార్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఒక్కో గుడ్డు బరువు 42 నుండి 50 గ్రాముల వరకు ఉండాలని టెండర్ నిబంధనల్లో పొందుపరుస్తారు. కానీ అధికారుల పర్యవేక్షణలోపంతో కాంట్రాక్టర్లు నాసిరకమైన, చిన్న గుడ్లనే సరఫరా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా కామేపల్లి మండలం ఊట్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారురాలైన చింతల సుమతి శనివారం కోడిగుడ్లను పరిశీలించి దుర్వాసన రావడంతో పడేసింది. అయితే, అంగన్‌వాడీ టీచర్ గుడ్లను సుమతికి ఇచ్చేటప్పుడే ఉడికించకుండా ముందే పగులగొట్టి చూడాలని సూచించడం అనుమానాలకు తావిస్తోంది.

అధిక ఉష్ణోగ్రతలే కారణమట...

గతనెల 29వ తేదీన ఊట్కూర్ అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు సరఫరా కాగా, లబ్ధిదారురాలైన సుమతికి ఈనెల 6న టీచర్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఆదివారం పగులగొట్టి చూడగా దుర్వాసన వచ్చాయని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌ను వివరణ కోరగా... గుడ్లు సరఫరా చేసి 12రోజులు కావడంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాడై ఉండొచ్చని తెలిపారు. ఈవిషయమై ఆరా తీయగా ఆమెకు మాత్రమే పాడైన కోడిగుడ్లు వచ్చినట్లుగా తేలిందని, దీంతో కొత్తవి ఇచ్చినట్లు తెలిపారు. అయితే, అధికారి చెప్పినట్లు అధిక ఉష్ణోగ్రతతో గుడ్లు పాడై ఉంటే ఒక్క మహిళకే మాత్రం రావడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఇకనైనా లబ్ధిదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోడిగుడ్లు సహా ఇతర పౌష్టికాహారం పంపిణీలో అధికారులు పర్యవేక్షణ పెంచాలని పలువురు కోరుతున్నారు.

ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించారు..



మాట్లాడుతున్న రమణాల లక్ష్మయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ ఏర్పాటులో సింగరేణి యాజమాన్యం ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించిందని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆరోపించారు. మండలంలోని 21 పిట్ ఏరియాలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ఐదో షెడ్యూల్ భూభాగంలో ఉందని, ఇక్కడున్న ఆదివాసీలతో పెసా గ్రామసభ నిర్వహించి ఆమోదం పొందితేనే ఓసీ ఏర్పాటు చేయాలని అన్నారు. కానీ ఈ ఏరియాకు సంబంధం లేనివారితో, అది కూడా మరో చోట గ్రామసభ నిర్వహించి అనుకూలంగా తీర్మానం చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెసా చట్టానికి లోబడి గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పూనెం వెంకటేష్, వట్టం కన్నయ్య, ధనసరి రామ్మూర్తి, పూనెం సూర్యనారాయణ, సూర్నపాక రామారావు, ధనసరి స్రవంతి, పూనెం ముత్తిలింగం, పూనెం అశోక్, పూనెం మధు, వెంకటరమణ, సుధాకర్, నారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో ఆదాయం

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం సమకూరుతుందని అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డీఓ ఆకుల బాలకృష్ణ, ఉద్యాన అధికారి సందీప్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా తాడువాయి, లింగంపేట, మోతె గ్రామాల రైతులు అశ్వారావుపేట మండలంలో సాగు చేస్తున్న పామాయిల్ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా పంటసాగు విధానం, అంతర పంటలు, ఆదాయం, సబ్సిడీ తదితర అంశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం తోటలను సాగు చేయడం ద్వారా రైతులు తక్కువ కాలంలోనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, కోకో, వక్క, వేరుశనగ వంటి అనేక అంతర పంటల సాగుతో లాభాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్య తప్పదు



ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం ఏడీఏ డి.రమేష్ స్పష్టం చేశారు. మండలంలోని పలు విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతీ రైతు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల వివరాలు రిజిష్టర్‌లో నమోదై ఉండాలని యజమానులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. డిమాండ్ ఉన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు బ్లాక్ చేసినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించినా దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు. రైతులు ఒకే కంపెనీ విత్తనాలు కాకుండా రెండు, మూడు రకాల విత్తనాలు వేస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధిక దిగుబడులు అంటూ వ్యాపారులు చెప్పే మాటలకు మోసపోవద్దని సూచించారు. లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విధిగా రసీదు పొందాలని, అందులో లాట్ నంబర్, తేదీ వివరాలు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు.

సన్నరకం ధాన్యానికే బోనస్

బూర్గంపాడు: వానాకాలం సీజన్‌లో రైతులు సన్నరకం ధాన్యం పండిస్తేనే క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వ బోనస్ అందుతుందని మణుగూరు ఏడీఏ తాతారావు తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ బోనస్ దక్కాలంటే ప్రభుత్వం ప్రతిపాదించిన సన్నరకం వరి వంగడాలనే సాగు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన సిద్ది(డబ్ల్యూజీఎల్ 44), కంపసాగర్(కేపీఎస్ 2874), సాంబమసూరి(బీపీటీ 5204), జగిత్యాల వరి–3 (జేజీఎల్ 27356), జగిత్యాల వరి–2(జేజీఎల్–28545), తెలంగాణ వరి–2(డబ్ల్యూజీఎల్–697), వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్–14), వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్–32100), జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470), పొలస ప్రభ(జేజీఎల్ 384), కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), ప్రాణహిత(జేజీఎల్ 11727), మానేరు సోనా (జేజీఎల్ 3828), తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్15048), వరంగల్ వరి(1119), కూనారం వరి–2(కేఎన్ఎమ్ 1638), వరంగల్ వరి–2(డబ్ల్యూజీఎల్ 962), రాజేంద్రనగర్ వరి–4(ఆర్ఎన్ఆర్21278), కూనారం వరి–1(కేఎన్ఎమ్ 733), తెలంగాణ వరి–3(జేజీఎల్ 21078), జగిత్యాల సన్నాలు(జేజీఎల్ 1798), జగిత్యాల సాంబ(జేజీఎల్3844), అంజనా(జేజీఎల్11118), నెల్లూరి మసూరి(ఎన్ఎల్ఆర్ 34449), ఎర్రమల్లెలు(డబ్ల్యూజీఎల్ 20471), ప్రద్యుమ్న(జేజీఎల్ 17004), రాజేంద్రనగర్ వరి–2(ఆర్ఎన్ఆర్ 154359), సుమతి(ఆర్ఎన్ఆర్ 18833), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని (ఆర్ఎన్ఆర్2354) వరి రకాలు సాగు చేయాలని వివరించారు.

'డిపెండెంట్ల' వయోపరిమితి పెంపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగులకు యాజమాన్యం తీపికబురు అందించింది. వారి వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 సంవత్సరాలకు పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గతవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుందని వివరించారు. తద్వారా సుమారు 600 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

క్లుప్తంగా

బీఈడీ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత

భద్రాచలంటౌన్: కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన 2022–24 విద్యా సంవత్సరం బీఈడీ ఫైనల్ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెలలో నిర్వహించిన చివరి సెమిస్టర్ పరీక్షలకు 94 మంది విద్యార్థులు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 7.79 సీజీపీఏతో కొప్పు మౌనిక ప్రథమ, 7.76 సీజీపీఏతో వాంకుడోత్ సంతోష్ కుమార్ ద్వితీయ, 7.68 సీజీపీఏతో పూనెం తనుజ ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీరూ నాయక్, డీడీ మణెమ్మను పీఓ అభినందించారు.

డయాలసిస్ యూనిట్లు మంజూరు


ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి

ఇల్లెందు/పాల్వంచ/చర్ల: ఉమ్మడి జిల్లాలోని పాల్వంచ, సత్తుపల్లి, చర్ల ఆస్పత్రులకు డయాలసిస్ యూనిట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్, తెలంగాణ రాష్ట్రహెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేశాయి. సత్తుపల్లి, పాల్వంచ, చర్ల ఆస్పత్రులకు ఒక్కో యూనిట్ చొప్పున డయాలసిస్ సెట్ మంజూరు చేస్తూ కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిష్టినా జడ్ చొంగ్తూ ఆదేశాలు ఇచ్చారు. కాగా ఒక్కో సెట్‌లో ఐదు మిషన్లు ఉండగా, మూడు ఆస్పత్రులకు కలిపి 15 మిషన్లు మంజూరయ్యాయి. దీంతో డయాలసిస్ పేషెంట్లకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం పాలిసెట్‌లో ర్యాంకు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ బి.నాగముని నాయక్ తెలిపారు. ఈ నెల 18న సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కొణిజర్ల: విధి నిర్వహణలో ఉద్యోగులు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా పర్యవేక్షించాలని ట్రాన్స్‌కో ఖమ్మం డీఈ నంబూరి రామారావు సూచించారు. కొణిజర్ల మండలం పెద్దగోపతిలో ఏఈలు, సిబ్బందితో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ల నిర్వహణ, విద్యుత్ లైన్లను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, పాడైపోయిన ఇన్సులేటర్లు మార్చడంపై తదితర అంశాలపై సూచనలు చేశారు. అలాగే, వానాకాలంలో పనులు చేసే సమయాన ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఈ ఎల్ తిలక్, ఏఈలు రాయల సురేష్, సుంకర స్వాతి, చింతకాని వెంకన్న, నాగులవంచ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్‌లో బంగారు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగ్ నుంచి బంగారు గొలుసు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం ద్వారకానగర్‌కు చెందిన రమాదేవి విజయవాడ వెళ్లడానికి సోమవారం బస్టాండ్‌కు వచ్చింది. బస్ ఎక్కి చూశాక తన బ్యాగ్‌లోని చంద్రహారం పెట్టె ఖాళీగా ఉండడంతో ఒక్కసారిగా లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో సీఐ బాలకృష్ణ, ఎస్ఐ సూరజ్ చేరుకుని బస్టాండ్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. కాగా, రమాదేవితో పాటు అదే బస్సు ఎక్కడానికి వచ్చిన వ్యక్తి గొలుసు చోరీ చూసి ఉంటారని భావిస్తున్నారు. కాగా, చోరీ అయిన గొలుసు విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితురాలు వెల్లడించింది. అయితే, బస్టాండ్‌లో చోరీలు సర్వసాధారణమైనప్పటికీ అటు పోలీసులు, ఇటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్లూరురూరల్: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో సోమవారం జరిగిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రైతు కాకర్ల రంగారావు భూమిలో మరో రైతు జాడునుపువాళ్ల కోటయ్యకు చెందిన గేదెలు, దూడలు మేస్తుండగా రంగారావు కుమారుడు నరేంద్ర అడ్డుకున్నాడు. దీంతో కోటయ్య.. నరేంద్రను కొడుతుండగా కాకర్ల రోశయ్య, చిలకమ్మ అడ్డుగా వెళ్లారు. ఈమేరకు పువాళ్ల కోటయ్య, పువాళ్ల బాబి, పువాళ్ల లక్ష్మి, మరో ఇద్దరు నరేంద్రను వదిలిపెట్టి తమను తీవ్రంగా కొట్టారని రోశయ్య, చిలకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో గాయపడిన వీరికి స్థానికంగా చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

అంతా 'పుష్ప' స్టైల్‌లోనే..

- జిల్లా మీదుగా క్వింటాళ్ల కొద్దీ గంజాయి తరలిస్తున్న అక్రమార్కులు
- పోలీసులు గట్టి నిఘాతో చెక్ పెడుతున్నా ఆగని దందా
- నెల రోజుల వ్యవధిలో రూ.4 కోట్ల విలువైన గంజాయి సీజ్


గత నెల 27న కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద పట్టుబడిన గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: అక్రమార్కులు జిల్లా మీదుగా భారీగా నిషేధిత గంజాయి తరలిస్తున్నారు. పోలీసులు కూడా గట్టి నిఘా పెట్టి అడ్డుకట్ట వేస్తున్నారు. అయితే స్మగ్లర్లు పుష్ప సినిమాలో ఎర్ర చందనం కలప తరలించినట్లు.. వాహనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని క్వింటాళ్ల కొద్దీ గంజాయి తరలించుకుపోతున్నారు. గత నెలలో నాలుగు సంఘటనల్లో పోలీసులు రూ.4.70కోట్ల విలువైన 15.05 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 23 మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిత్యం చెకింగ్‌లు, తనిఖీలు చేపడుతున్నా గంజాయి రవాణాను నిరోధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వాహనాల్లో పార్టీషన్ చేసి, ఇతర లోడ్‌ల మధ్యలో, ప్రైవేటు బస్సుల్లో చేసి గంజాయి తరలిస్తుండగా, పోలీసులు అప్రమత్తమై చెక్ పెడుతున్నారు. కానీ పూర్తిస్థాయి గంజాయి రవాణా ఆగిపోవడం లేదు. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాల నుంచి సరిహద్దులు దాటుకుని భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తున్నారు. భద్రాచలంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిత్యం గంజాయి పట్టుబడుతూనే ఉంది. కాగా తనిఖీలు చేపడుతున్న సమయంలో పోలీసుల్లో కొందరు ముందే స్మగ్లర్లకు సమాచారం ఇచ్చి గంజాయిని దాటించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలతోపాటు స్మగ్లర్ల మధ్య విభేదాలతో పోలీస్ శాఖకు అందిన సమాచారంతో ఎక్కువసార్లు గంజాయి పట్టుబడుతున్నట్లు సమాచారం.

గత నెలలో పట్టుబడిన గంజాయి వివరాలు..

- గత నెల 25న అశ్వారావుపేటలో పనసలోడులో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బొలెరో వాహనంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా రూ.83.83 లక్షల విలువైన 3.5 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11 మందిపై కేసు నమోదు చేశారు.
- గత నెల 26న భద్రాచలం నుంచి అశ్వాపురం మీదుగా ఏటూరునాగారం మార్గంలో హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ బస్సులో రూ. 66 లక్షల విలువైన 2.48 క్వింటాళ్ల గంజాయిని అశ్వాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అదే రోజు కారులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని ఇల్లెందులో పట్టుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు.
- డీసీఎం వ్యాన్‌లో ప్రత్యేకంగా అరను తయారు చేసి రూ.1.30 కోట్ల విలువైన 4.29 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా గత నెల 27న కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
- ఈ నెల 3న మణుగూరులోని హనుమాన్ ఆలయం సమీపంలో రూ. 1.19 కోట్ల విలువైన 4.77 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

అటవీ శాఖలో ఇంటి దొంగలు!

- పోడు పేరుతో 25 ఎకరాల్లో చెట్ల నరికివేత
- నరికిన విలువైన మారుజాతి కలప మాయం
- ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల ఆరా..


పోడు నరికిన ప్రాంతంలో కనిపించని మారుజాతి కలప

అశ్వారావుపేటరూరల్: అటవీశాఖ గుమ్మడవల్లి సెక్షన్ పరిధిలోని కుదుములపాడు అటవీ ప్రాంతంలో కొత్తగా పోడు వ్యవసాయం కోసం అడవిని నరికివేయడంతోపాటు విలువైన కలప మాయం చేశారు. ఈ ఘటన జరిగి దాదాపు నాలుగు నెలలు కావొస్తుండగా, పది రోజుల క్రితమే పోడు నరికినట్లు ఓ అధికారి నివేదిక అందించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోడు నరికిన ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన కొత్తగా ప్లాంటేషన్ వేసేందుకు జేసీబీతో మోదులు తీయించి, చదును చేసే పనులు చేపట్టడం అనుమానాలకు బలం చేకూర్చుతోంది. పోడు నరికివేత ఘటనలో నేలమట్టమైన మారుజాతి వృక్షాలపై కనీసం కేసు నంబర్లు కూడా వేయకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంలో తనపై, మరో ఎఫ్ఎస్ఓపై చర్యలు తీసుకోకుండా ఓ రేంజ్ స్థాయి అధికారి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా 'సాక్షి' దినపత్రికలో 'అడవి నరికేశారు' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీసీఎఫ్, ఎఫ్‌డీవో వేర్వేరుగా వివరాలు ఆరా తీశారు.

మారుజాతి కలప ఏమైనట్లు..?

కుదుములపాడు అటవీ ప్రాంతంలో దాదాపు 25 ఎకరాల్లో అడవి నరికివేయగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 25 ఎకరాల్లో విలువైన నారవేప, సింధుగా, జిల్లేడు, తెల్లమద్దితోపాటు ఇతర మారుజాతి వృక్షాలు భారీగా ఉన్నాయి. దాదాపు పదెకరాల్లో పెద్ద పెద్ద మోదులు ఉండగా, వాటికి సంబంధించిన కలప మాత్రం ఘటనా స్థలంలో కనిపించడం లేదు. ఈ వ్యవహారంలో ఓ అధికారి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి అటవీశాఖలో ఇంటి దొంగల పాత్రను నిగ్గు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

ఆరుగురిపై కేసులు నమోదు

అడవి నరికివేసిన ఘటనలో ఆరుగురిపై కేసులు నమోదు చేశామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీట్ ఆఫీసర్ చర్యలు తీసుకున్నామని అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజర్ మురళి తెలిపారు. విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోడు నరికిన ప్రదేశంలో మారుజాతి కలపపై కనిపించకపోవడంపై వివరణ కోరగా.. పెద్ద వృక్షాలు లేవని, చిన్న చిన్న చెట్లేనని, మరో రెండు రోజుల్లో సమగ్ర వివరాలు వెల్లడిస్తామని చెప్పుకొచ్చారు.


నేలమట్టమైన మారుజాతి వృక్షంపై కేసు నంబరు వేయని దృశ్యం


వినాయకపురం-ఆసుపాక మార్గంలో విరబూసిన చెట్లు

ఆహ్లాదం.. పూలదారి

హరితహారం పథకం కింద ప్రధాన మార్గంలో ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి. అవి ప్రస్తుతం విరబూసి కనువిందు చేస్తున్నాయి. అశ్వారావుపేట మండలం వినాయకపురం నుంచి ఆసుపాక గ్రామం మధ్యలో ఏడేళ్ల క్రితం అటవీ శాఖ ద్వారా ప్రధాన రహదారికి రెండు వైపులా వివిధ రకాల మొక్కలు నాటారు. వీటిలో గుల్ మెహర్ చెట్లు ఎర్రటి పూలతో వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. – అశ్వారావుపేటరూరల్


దైవ దర్శనానికి వెళ్లి..

- గోదావరిలో తల్లీకొడుకులు గల్లంతు
- ఏపీలోని వేలేరుపాడు మండలం కట్కూరులో ఘటన


నాగమణి, తేజ శ్రీనివాస్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: దైవ దర్శనానికి వెళ్లి గోదావరిలో తల్లీకొడుకులు గల్లంతైన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండల కేంద్రంలోని చిన్నంశెట్టిబజార్‌కు అల్లంశెట్టి నాగేశ్వరరావు, వంటశాల వెంకటేశ్వరరావు కుటుంబాలకు చెందిన 11 మంది రెండు ఆటోల్లో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కట్కూరు వద్దగల శివాలయానికి వెళ్లారు. శివాలయంలో దైవ దర్శనం చేసుకుని పూజలు చేశారు. అనంతరం పిల్లలు స్నానాలు చేద్దామని కోరడంతో, వారంతా కలిసి గోదావరిలోకి దిగారు. ఈ క్రమంలో అల్లంశెట్టి నాగేశ్వరరావు కుమారుడు తేజ శ్రీనివాస్(23) కాలుజారి నీట మునుగుతూ కేకలు వేశాడు. గమనించిన తల్లి నాగమణి (43) కుమారుడిని కాపాడబోయి ఆమె కూడా నీటిలో గల్లంతైంది. కుటుంబీకులంతా చూస్తుండగానే ఈ ఘటన క్షణాల్లో జరిగిపోగా, వాళ్ల కళ్లెదుటే వారిద్దరూ గోదారిలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వేలేరుపాడు మండల అధికారులు ఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు రెండు గంటల తర్వాత నాగమణి, తేజ శ్రీనివాస్ మృతదేహాలు లభ్యం కాగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని వేలేరుపాడు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా తల్లీకొడుకుల మృతితో చిన్నంశెట్టి బజారులో విషాదం నెలకొంది. అశ్వారావుపేటలో చిరు వ్యాపారం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నాగేశ్వరరావు భార్య, కుమారుడి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

ఇది ప్రకృతి 'చిత్రం'



ఇది ఏ కళాకారుడి కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్ కాదు.. ప్రకృతి గీసిన చిత్రమిది! సాయంకాలం సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్తున్న సమయాన.. ఇంకోపక్క చంద్రుడు ప్రకాశిస్తుండగా ఆకాశం నీలం రంగులోకి మారిన దృశ్యమే ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నుంచి భద్రాచలం వెళ్లే మార్గాన కిన్నెరసాని బ్రిడ్జి వద్ద సోమవారం సాయంత్రం ఈ దృశ్యం కనిపించగా పలువురు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


డీసీఎం వ్యాను కేబిన్‌లో ఇరుక్కున్న క్షతగాత్రులు

అశ్వారావుపేటరూరల్: పోలీస్ వాహనాన్ని లారీ, లారీని వ్యాన్ ఢీకొని ముగ్గురు గాయపడ్డ సంఘటన మండలంలోని నారంవారిగూడెం సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేట సరిహద్దు చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆవులను తరలిస్తున్న ఓ డీసీఎంను నిలిపివేయగా, ఆ వెనుకే వస్తున్న మరో రెండు పశువుల వ్యాన్లు ఆగకుండా వెళ్లిపోయాయి. దీంతో పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు వెంబడిస్తుండగా, నారంవారిగూడెం వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ లారీ అదుపుతప్పి పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని స్వల్పంగా ఢీకొంది. దీంతో పోలీస్ సిబ్బంది లారీని నిలిపి డ్రైవరుతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి కెమికల్ లోడుతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ వేగంగా దూసుకొచ్చి ఆగి ఉన్న లారీ ఢీకొట్టింది. ఆ లారీ ముందుకు కదలి మళ్లీ పోలీస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ కొండ్రాకు శ్రీను, వ్యాన్‌లో ప్రయాణిస్తున్న కల్లూరుకు చెందిన కోలా నరసింహారావు, దామాల బాబూరావు తీవ్రంగా గాయపడి కేబిన్‌లో ఇరుక్కుపోయారు. పోలీసు సిబ్బంది, స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు. వ్యాన్‌ను అతివేగంగా నడిపి, ఆగి ఉన్న లారీను ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పశువుల వాహనాలకు అనుమతులు ఉండగా, పోలీసులు వదిలేశారు.

పోక్సో కేసు నమోదు

దమ్మపేట: మైనర్ బాలికను వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికను రమేష్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమపేరుతో, లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

దాడి ఘటనలో ఐదుగురిపై..

పాల్వంచరూరల్: దాడి ఘటనలో ఐదుగురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే నెపంతో మండల పరిధిలోని సీతానగర్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పల్లపు హనుమంతుపై ఐదుగురు వ్యక్తులు గత నెల 15వ తేదీ రాత్రి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోడ మోహన్, వినోద్, పవన్‌కళ్యాణ్, శ్రావణ్, ధనుష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన అంగోతు వాల్యా(57) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రం కావడంతో ఈ నెల 8న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలో సోమవారం ఓ యాచకుడు మృతి చెందాడు. ఎస్ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. రామాలయం నిత్యాన్నదాన సత్రం వద్ద సుమారు 50 ఏళ్ల వయసు ఉన్న యాచకుడు మృతి చెంది ఉన్నాడు. తెలుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచామని, ఆచూకీ తెలిసినవారు 87126 82160 నంబర్‌లో లేదా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో మాజీ సర్పంచ్ ఇల్లు దగ్ధం

రూ.10 లక్షల మేర ఆస్తినష్టం

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మాజీ సర్పంచ్ రేసు వెంకయ్యతో పాటు పక్కనే ఉన్న ఆయన బంధువుల ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి అందరూ నిద్రలో ఉన్న సమయాన ఒకేసారి వెంకన్న ఇంట్లో ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంకయ్య కుటుంబీకులకు తెలపగా వారి చూసేలోగా ఆయనతో పాటు మరో ఇంటికి మంటలు అంటుకున్నాయి. దీంతో అందరూ కట్టుబట్టలతో సహా బయటకు వచ్చేశారు. గ్రామస్తులంతా కలిసి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తుండగానే వైరా నుంచి ఫైర్ ఇంజన్ వచ్చినా.. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లతో పాటు పక్కనే ఉన్న వరిగడ్డి వాము సైతం కాలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లోని బంగారు ఆభరణాలు, సామగ్రి, నగదు, బియ్యం, పిల్లల ఒరిజనల్ ధృవపత్రాలు కాలిపోవడంతో రూ.10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. వెంకయ్య రెండు పర్యాయాలు సర్పంచ్‌గా చేసినా గడ్డి ఇంట్లోనే నివాసముంటున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఆర్ఐ నవీన్ సోమవారం ఉదయం వివరాలు సేకరించారు. అలాగే, మాజీ సర్పంచ్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సైతం పరామర్శించారు. స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి వారికి తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, వేములు కృష్ణప్రసాద్, పాశం శ్రీనివాసరావు, మేడ ధర్మారావు, చందమామ నర్సింహరావు, గిద్దగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ముళ్ల పొదల్లో దాచిన నిందితులు


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

ఖమ్మంక్రైం: గంజాయిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న వేళ.. కొందరు అక్రమ రవాణాకు కొత్త మార్గాలను వెతుక్కుంటున్నారు. ఈక్రమంలోనే సోమవారం ఖమ్మంలోని కొత్త బస్టాండ్ సమీపాన ముళ్ల పొదల్లో దాచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముళ్ల పొదల్లో అక్రమార్కులు గంజాయిని భద్రపర్చారనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈమేరకు మూడు సంచుల్లో ఉన్న రూ.20లక్షల విలువైన 39.5 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిస్సా, భువనేశ్వర్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయిని అదును చూసి బస్సుల్లో తరలించేందుకు ఇక్కడ దాడినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఉద్యోగులు బాబు, సుధీర్, హరీశ్, వెంకటేష్, విజయ్, హన్మంతరావు, బేబీ, స్వరూప పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దుర్మార్గం: కొంతం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లతో పాటు భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా దాడులకు పాల్పడటం అనాగరికమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి అరాచకాలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమికి అధికారం

- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి


మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్‌లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి గెలుపొందిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా ఆయా పార్టీలకు మెజార్టీ రావడంతో మేధావులు, విశ్లేషకులతో పాటు సామాన్య జనంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12కి పైగా ఎన్నో ప్రముఖ సంస్థలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడిస్తే అందుకు భిన్నంగా కూటమి విజయం సాధించడం వెనుక ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానాలను కొట్టి పారేయలేమన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవీఎంలు తయారు చేసే సంస్థలు దాదాపు 30 ఉండగా, అందులో బీజేపీకి చెందిన వారివే ఎక్కువ సంస్థలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని గతంలో స్వయంగా చంద్రబాబునాయుడే ప్రకటించారని వడ్లమూరి గుర్తు చేశారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. చాలాసేపు పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీలు గొల్ల బాబురావు, మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి, గుడివాడ అమర్‌నాథ్, నాయకులు రెడ్డి శాంతి, చిర్ల జగ్గిరెడ్డి, విశ్వాసరాయ కళావతి, బుట్టా రేణుక, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, శోభా హైమావతి, వంగా గీత, ధనలక్ష్మి, విజయ, డాక్టర్ సత్యవతి, ఉమాబాల, ఎల్ అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.


గోపువానిపాలెంలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం


సంధ్యాల మండలం రాయిమల్పురంలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన అభివృద్ధి శిలాఫలకాలు


కూరాడ సచివాలయంపై ఉన్న వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను గునపంతో పగలకొడుతున్న జనసేన కార్యకర్త

పరాకాష్టకు విధ్వంసకాండ

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవరూ ఉండకూడదన్నట్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పార్టీకి ఓట్లేసిన వారిని దుర్భాషలాడుతున్నారు. ఓట్లు వేయించిన వారు ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది అన్యాయం కదా.. అని ప్రశ్నిస్తే దుస్తులు విప్పి కొడుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా, వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పిస్తున్నారు. యూనివర్సిటీ వీసీలపై దౌర్జన్యం చేస్తున్నారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఇలా ఎప్పుడైనా జరిగిందా? ఇప్పుడే ఎందుకు ఇలా జరుగుతోంది? టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధ్వంసం సృష్టిస్తుంటే.. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తుంటే.. స్పందించాల్సిన పోలీసులు ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నారు? నిజంగా ఈ పరిణామం ఖాకీ డ్రస్సుకే అవమానం.

దేశ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని రీతిలో గత ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వెలిశాయి. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, కొత్త రూపు సంతరించుకున్న స్కూళ్లు.. ఇలా ఎన్నెన్నో ప్రభుత్వ బిల్డింగ్‌లు నిర్మాణమయ్యాయి. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల విలువైన ఆస్తి సమకూరింది. ఇదంతా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. భద్రంగా కాపాడుకోవాలి. అలాంటిది పని గట్టుకుని ఊరూరా టీడీపీ సేన గునపాలు చేత పట్టుకుని ధ్వంసం చేస్తుండటాన్ని ఏమనాలి? రౌడీయిజం, దౌర్జన్యం, ఉన్మాదం.. ఇలా ఈ పదాలన్నీ తక్కువే. ఎవర్ని చూసుకుని ఇలా పేట్రేగిపోతున్నారు? చంద్రబాబు, లోకేశ్‌లను చూసుకునే కదా!

బాపట్ల జిల్లాలో పిండ ప్రదానం చేస్తుంటే అడ్డుకోవడం.. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిని జేసీబీతో కూల్చేయడం.. ఏకంగా నెల్లూరు మేయర్ దంపతులనే బెదిరించడం.. ఇదే జిల్లా దత్తులూరు మండలంలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్లను ధ్వంసం చేయడం.. కొండాపురం మండలం గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చేయడం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం.. ఇకపై పోస్టులు ఆపేస్తామని వారితో ప్రకటనలు ఇప్పించడం.. తప్పుడు కేసులు పెట్టడం.. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో అరాచకం కళ్లెదుటే కనిపిస్తోంది ఒక్క పోలీసులకు తప్ప అందరికీ.

విగ్రహాలపై అక్కసు

రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

పలుచోట్ల శిలాఫలకాల తొలగింపు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిప్యూటీ సీఎంగా పవన్!

- జనసేనకు మరో నాలుగు మంత్రి పదవులు
- కూర్పుపై కసరత్తు చేస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే ప్రధాన ప్రతిపక్షంగా సభలో అడుగు పెడతామని చెప్పడంతో పలు ఊహాగానాలు సాగాయి. అయితే తాజాగా పవన్ ప్రభుత్వంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చల్లో దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పవన్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తనతోపాటు జనసేన నుంచి గెలిచిన మరో నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని పవన్ కోరగా చంద్రబాబు అందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఒకటి నాదెండ్ల మనోహర్‌కి దక్కడం ఖాయమని చెబుతున్నారు. మిగిలిన పదవులకు కందుల దుర్గేష్, పంతం నానాజీ, అరణి శ్రీనివాసులు, వంశీకృష్ణ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి.

నేడు టీడీపీ శాసన సభాపక్ష సమావేశం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశంలో చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా పదవులు

చంద్రబాబు ఉమ్మడి జిల్లాల వారీగానే మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నారా లోకేష్ మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పదవుల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం జిల్లా నుంచి అచ్చెన్నాయుడు, గౌతు శిరీష, కూన రవికుమార్, కొండ్రు మురళి రేసులో ఉన్నారు. అయితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినందున అచ్చెన్నాయుడికి ఇవ్వటంపై సందిగ్ధం నెలకొంది. విజయనగరం జిల్లా నుంచి కళా వెంకట్రావు, సంధ్యారాణి పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా నుంచి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. కృష్ణా జిల్లా నుంచి బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్ర పేర్లను పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణల్లో ఒకరిద్దరికి అవకాశం లభించనుంది. ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, బాల వీరాంజనేయ స్వామి పోటీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా నుంచి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశావహుల జాబితాలో ఉన్నారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా రేసులో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత ఉన్నారు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జయనాగేశ్వర్‌రెడ్డిలో ఒకరిద్దరికి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు స్థిరంగా కదులుతున్నాయి. గాలుల కోత, షీర్ జోన్ ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు మరఠ్వాడా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో, బుధవారం నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. గురువారం బాపట్ల, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని పేర్కొంది.


జిల్లా వార్తలు

రైతులకు శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలి


ఎండీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ సాగు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యాన ఆసక్తి ఉన్న రైతుల కోసం శిక్షణ ఇవ్వడంతోపాటు పరిశోధనల కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిపామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరి ఉమా మహేశ్వరరెడ్డి, కొక్కరపాటి పుల్లయ్య కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం హైదరాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ ఎండీ కె.అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా ఆయిల్‌ఫెడ్ ద్వారా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. అలాగే, ఇక్కడి ఫ్యాక్టరీలో ఆయిల్ రికవరీ లెక్కింపు కోసం టన్ను కెపాసిటీతో యూనిట్ ఏర్పాటు చేయాలని, రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలని కోరారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఏన్కూరు: రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ విభాగం వరంగల్ రీజియన్ ఎస్ఈ వి.శ్రీనివాసులు సూచించారు. ఏన్కూరు మండలం బురదరాఘవాపురం నుండి పాపకొల్లు, జన్నారం నుండి తూతకలింగన్నపేట వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రిని పరిశీలించిన ఎస్ఈ.. ఎక్కడ కూడా నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు సత్యనారాయణ, శశి, ఏఈ నాగేందర్ పాల్గొన్నారు.

సరికొత్తగా ఖమ్మం మార్కెట్

రూ.100 కోట్లతో వ్యవసాయ మార్కెట్‌కు హంగులు

- 2 లక్షల మిర్చి బస్తాలు వచ్చినా ఇక్కట్లు లేకుండా షెడ్లు
- 17 ఎకరాల విస్తీర్ణంలో 6 నుంచి 7 భారీ షెడ్ల నిర్మాణానికి కసరత్తు
- కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, ఇతర నిర్మాణాలకు సైతం ప్రణాళిక


ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నూతన హంగులు సంతరించుకోనుంది. ఇప్పటికే రాష్ట్రంలో రెండో పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా విరాజిల్లుతుండగా, దేశంలోనే ఓ మోడల్ మార్కెట్‌గా అధునాతనంగా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో మిర్చి కొనుగోళ్లకు గుంటూరు, వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లు పేరొందగా, వీటిలో ఖమ్మం మార్కెట్ తేజా రకం మిర్చి కొనుగోళ్లకు పేరుగాంచింది. విదేశాల్లో ఈ మిర్చికి అధిక డిమాండ్ ఉండగా, తెలుగు రాష్ట్రాల రైతులు ఇక్కడ పంట విక్రయించేందుకు ప్రాధాన్యమిస్తారు. గడిచిన ఐదారేళ్లుగా ఈ ప్రాధాన్యం మరింతగా పెరగగా, విదేశీ ఎగుమతిదారులు భారీగా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇక ఈ మిర్చి పంట ఆధారంగా జిల్లాలో 40 కోల్డ్ స్టోరేజీలను నిర్మించారు. పరిసర ప్రాంతాల్లో మిర్చి ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేశారు.

తేజా మిర్చితో పెరుగుతున్న టర్నోవర్..

తేజా మిర్చి నుంచి వచ్చే ఆయిల్‌కు విదేశాల్లో డిమాండ్ ఎక్కువ. ఈ రకం మిర్చితోపాటు ఇతర పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో ఖమ్మం మార్కెట్ ఏటా రూ.3 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. అయితే మార్కెట్‌లో తగిన సౌకర్యాలు లేకపోవడంతో సీజన్‌లో యార్డులు నిండి రైతులు మిర్చి బస్తాలను రహదారుల వెంట దింపుకుని విక్రయించుకునే పరిస్థితి నెలకొంది. భవిష్యత్‌లో మిర్చి సాగు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌ను ఆధునీకీకరించేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పించారు. మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు మార్కెటింగ్ అధికారులతో పలుమార్లు సమావేశమై చర్చించారు. మంత్రి ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం, ఓ ప్రైవేటు ఆర్కిటెక్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నూతన సాంకేతిక విధానంతో కూడిన డిజైన్‌ను రూపొందించారు.

కార్యాలయం, దుకాణ సముదాయాలు కూడా..

షెడ్లతోపాటు మార్కెట్ కార్యాలయ పరిపాలనా విభాగం, చైర్మన్, సెక్రటరీ చాంబర్ల నిర్మాణాలతోపాటు వ్యాపారులకు, రైతులకు సౌకర్యవంతంగా దుకాణ సముదాయాల నిర్మాణాలకు కూడా డిజైన్‌లో స్థానం కల్పించారు. పంట విక్రయించిన రైతులకు పైకం అక్కడికక్కడే చెల్లించేలా దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

రైతుల విశ్రాంతి భవనం, బ్యాంకు వంటి నిర్మాణాలు

రైతులకు విశ్రాంతి భవనం, ఆర్థిక లావాదేవీల నిమిత్తం ఓ బ్యాంకు బ్రాంచి నిర్వహించేలా భవన నిర్మాణానికి కూడా డిజైన్‌లో స్థానం కల్పించినట్లు సమాచారం. ఫైర్ స్టేషన్, క్యాంటీన్ వంటి నిర్మాణాలను, రైతులతో పాటు మార్కెట్ వర్గాలకు సౌకర్యవంతంగా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా డిజైన్ చేశారు. రానున్న పంటల విక్రయాల అన్ సీజన్‌లో నిర్మాణాలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ యోచిస్తోంది. అంతా పూర్తయితే దేశంలోనే మోడల్ మార్కెట్‌గా ఖమ్మం నిలవనుంది.

2 లక్షల మిర్చి బస్తాల క్రయ, విక్రయాలకు అనుగుణంగా..


మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రధానంగా రెండు విభాగాలుగా ఉంది. ఒకటి పత్తి యార్డు కాగా, మరొకటి మిర్చి, అపరాలు, మార్కెట్ పరిపాలనా విభాగం కార్యాలయం, చైర్మన్, సెక్రటరీ చాంబర్ల కార్యాలయాలతో ఉన్నాయి. వీటిలో 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మిర్చి, అపరాల యార్డులు, చైర్మన్, కార్యదర్శి చాంబర్ల కార్యాలయాల స్థానంలో రూ. 100కోట్ల వ్యయంతో 2 లక్షల మిర్చి బస్తాల క్రయ, విక్రయాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. తూర్పు నుంచి పడమర దిశగా ఆరు నుంచి ఏడు షెడ్లను నిర్మించనున్నారు. ఒక్కో షెడ్డు 25 నుంచి 30 మీటర్ల వెడల్పుతో, 150 మీటర్ల పొడవు, 30 మీటర్ల ఎత్తుతో ఉండేలా డిజైన్ చేశారు. సోలార్ విధానంతో కూడిన రూఫ్‌తో రిఫ్లెక్టెడ్ లైటింగ్ ఉండే విధంగా నిర్మాణాలు ప్రణాళికలు రూపొందించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజనుల్లో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తుల్లో తమ పరిధిలోనివి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని చెప్పారు. కాగా, గిరిజనులు పోడు భూములకు పట్టాలు, జీవనోపాధి కోసం రుణాలు, గురుకుల కళాశాలల్లో సీట్లు, వ్యవసాయ భూములకు విద్యుత్ మోటార్లు తదితర అంశాలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన వెంకటేష్‌తోపాటు మరో 12 మంది గిరిజనులు వారి గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేయించి బోరు మోటార్లు ఇప్పించాలని, ఆళ్లపల్లి మండలం రామోజీగూడేనికి చెందిన 15 మంది గిరిజనులు వారి పొలాలకు త్రీఫేస్ విద్యుత్ లైన్ వేయించాలని కోరినట్లు వెల్లడించారు. అనంతరం యూనిట్ అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా వాతావరణ మార్పులతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా వార్డెన్లు, హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్సీఓ వెంకటేశ్వరరాజుతో పాటు వివిధ విభాగాల అధికారులు భాస్కర్, శ్రీనివాస్, మునీర్ పాషా, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగోన్నతులు, బదిలీలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించడమే కాక ఇంకొందరిని బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీఎం ఎడ్యుకేషన్ నీలం వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలోని డైరెక్టర్ ఆపరేషన్స్ కార్యాలయంలో ఎస్‌ఓటూ డైరెక్టర్ ఆపరేషన్స్‌గా నియమించారు. అలాగే, సింగరేణి సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ అదనంగా జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్జీగా ఉన్న సామ్యేల్ సుధాకర్‌ను పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ జీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇక ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ బెర్నాడెట్టే నికోలస్‌కు జీఎం ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే, మైనింగ్, ఈ అండ్ ఎం, ఫైనాన్స్, పర్సనల్, ఎస్టేట్స్, లీగల్, మెడికల్, సర్వేతోపాటు మరికొన్ని విభాగాల్లో సుమారు 40 అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిత్రకూట మండపంలో మైక్ ఏర్పాటుకు రూ.1.55 లక్షలు


ఆలయ ఈఓ రమాదేవితో దాత కుటుంబసభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో చిత్రకూట మండపం వద్ద మైక్‌సెట్ ఏర్పాటుకు ఏపీకి చెందిన భక్తులు సోమవారం విరాళం అందజేశారు. శ్రీకాకుళంలోని భూపాలరావు కాలనీకి చెందిన పరిణం రామారావు –కృష్ణవేణి దంపతులు రూ.1.55 లక్షలను ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.


దాతకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి...

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం ఓ భక్తురాలు విరాళం అందజేశారు. హైదరాబాద్ నగరంలోని బండ్లగూడకు చెందిన ఎస్పీ మంజుల రూ.50 వేల చెక్కు ఆలయ అధికారులకు అందజేసి కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆమెకు అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబీకులతో పాటు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.